నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, మంగళవారం 7 జనవరి 2025 | MAHABUBABAD


# 30,43,540

## ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్లు

- పురుషుల కంటే మహిళలే అధికం
- తుది ఓటరు జాబితా విడుదల

హనుమకొండ, జనవరి 6 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,318 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 30,49,540 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 14,90,056 మంది కాగా, మహిళలు 15,51,289, ట్రాన్స్‌జెండర్లు 504, సర్వీస్ ఓటర్లు 2,141 మంది. ప్రత్యేక ఓటరు నమోదు అనంతరం తుది జాబితాను సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. అన్ని జిల్లాల్లోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో అత్యధిక ఓటర్లుండగా, ములుగులో తక్కువ మంది ఉన్నారు. కాగా హనుమకొండ జిల్లాలో 483 పోలింగ్ స్టేషన్లుండగా 2,48,363 మంది పురుషులు, 2,59,998 మహిళలు, 18 మంది ట్రాన్స్‌జెండర్లు, 239 మంది సర్వీస్ ఓటుర్లు కలిపి 5,08,618 మంది ఓటర్లున్నారు. అలాగే వరంగల్ జిల్లాలో 795 పోలింగ్ స్టేషన్లుండగా పురుషులు 3,76,965, మహిళలు 3,95,489, ట్రాన్స్‌జెండర్లు 370, సర్వీస్ ఓటర్లు 629, మొత్తం కలిపి 7,73,453 మంది ఓటర్లున్నారు. జనగామ జిల్లాలో 865 పోలింగ్ స్టేషన్లు, పురుషులు 3,75,729, మహిళలు 3,86,335, ట్రాన్స్‌జెండర్లు 28, సర్వీస్ ఓటర్లు 464 కలిపి 7,62,106 మంది ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 555 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 2,37,543, మహిళలు 2,47,715, ట్రాన్స్‌జెండర్లు 54, సర్వీస్ ఓటర్లు 380 కలిపి 4,85,692 మంది ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 317 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుషులు 1,36,952, మహిళలు 1,41,022, ట్రాన్స్‌జెండర్లు 8, సర్వీస్ ఓటర్లు 203 కలిపి 2,78,185 మంది ఉన్నారు. ములుగు జిల్లాలో 303 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 1,14,504, మహిళలు 1,20,730, ట్రాన్స్‌జెండర్లు 26, సర్వీస్ ఓటర్లు 226 కలిపి 2,35,486 మంది ఉన్నారు.

- కేసీఆర్‌ను కలిసిన కవిత, నాగజ్యోతి




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలో సోమవారం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి తన పుట్టిన రోజు సందర్భంగా భర్త జగదీశ్‌తో కలిసి అధినేత కేసీఆర్ ఆశీస్సులు అందుకున్నారు. – ములుగు, (నమస్తే తెలంగాణ)/మహబూబాబాద్ రూరల్, జనవరి 6



స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## 'వరంగల్ డిక్లరేషన్' అమలు చేయాలి

- స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్/ ధర్మసాగర్, జనవరి 6: వరంగల్ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకూ రూ.15వేలు రైతుభరోసా ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు రైతులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ మోసానికి వ్యతిరేకంగా సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, ధర్మసాగర్ మండలంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని చెప్పిందని, నేడు మాటమార్చి రూ.12వేలు ఇస్తామని రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రంజిత్, పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుంభం కుమార్, బంగ్లా శ్రీనివాస్, గుర్రం శంకర్, గాదే రాజు, గుండె రంజిత్, మారపల్లి ప్రసాద్, ఆకారపు అశోక్, గుండె మల్లేశ్, కర్ర సోమిరెడ్డి, లాల్, మాజీ ఎంపీటీసీలు విజయ్, శోభ, మాధవరెడ్డి, సుదర్శన్, బొడ్డు ప్రతాప్, బేరే హరీశ్, మధు, జోగు శేఖర్, భాస్కర్, అశోక్‌రెడ్డి, విజయ్, హసీఫ్, చేరాలు, దేవేందర్, రమణాకర్, రాజ్ కుమార్, రంజిత్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.



దేవరుప్పుల : జాతీయ రహదారిపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# ఇదేనా రైతు డిక్లరేషన్..?

దగా కాంగ్రెస్.. హామీ బోగస్

- మాట ఇచ్చి మోసం చేయడంపై భగ్గుమన్న బీఆర్ఎస్
- కాంగ్రెస్ సర్కారు తీరుపై రైతులు ఆగ్రహం
- రైతుభరోసా రూ.12వేలే ఇస్తామడంపై మిన్నంటిన నిరసన
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధర్నా, రాస్తారోకోలు
- హామీ ప్రకారం ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరిక

**ఎకరానికి ఏటా రూ.15వేలు రైతుభరోసా** ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలప్పుడు 'వరంగల్ రైతు డిక్లరేషన్' పేరుతో రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పి ఇప్పుడు మాట మార్చి మోసం చేయడంపై ఓరుగల్లు రైతాంగం కన్నెర్రజేసింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాదైనా పెట్టుబడి సాయం ఇవ్వకుండా కాలయాపన చేయడమేగాక తీరా ఇప్పుడు రూ.12వేలే ఇస్తామంటూ కోతలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈమేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించగా అన్నదాతలు కదలి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ తీరుపై దుమ్మెత్తిపోశారు. ఈ సందర్భంగా మాట తప్పిన కాంగ్రెస్ డౌన్ డౌన్.. అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.15వేలు ఇవ్వాల్సిందేనని లేకపోతే రైతుల తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.

- నమస్తే నెట్‌వర్క్, జనవరి 6




## కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన

అరెస్టులతో పోరాటం ఆగదు : దాస్యం



కేయూ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న దాస్యం

హనుమకొండ, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని.. రాష్ట్రంలో ప్రతీకార, నిర్బంధ, నిరంకుశ పాలన కొనసాగుతున్నదని దాస్యం మండిపడ్డారు. కానిస్టేబుల్ మొదలు ఎస్ఐ, సీఐలు, ఏసీపీ స్థాయి వరకు పార్టీ కార్యాలయం వద్ద పహారా కాసి అక్రమంగా అరెస్ట్ చేయడంపై పోలీసులు, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే అక్రమంగా అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీలేదన్నారు. వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్ ప్రకటించి ఇవాళ రైతుభరోసాలో కోత విధించి, రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీ కూడా సగం మాత్రమే చేశారని మహిళలకు రూ.2500, తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ, విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదన్నారు. రైతుల తరఫున మాట్లాడేందుకు ప్రయత్నిస్తుంటే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని, పార్టీ శ్రేణులపై లాఠీచార్జ్ చేయడం, పోలీస్‌స్టేషన్లు తిప్పుతుండడంపై మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేసే వరకు పోరాడుతామని.. అరెస్టులతో అడ్డుకోలేదని బీఆర్ఎస్ నిరంతరం రైతులకు అండగా ఉంటుందని దాస్యం స్పష్టంచేశారు. ఆయన వెంట కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ నాయకుడు నయీమొద్దీన్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, వీరేందర్, బండి రజినీకుమార్, మిట్టపల్లి రమేశ్, పోలపల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

## నర్సంపేట నుంచే రైతుల తిరుగుబాటు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ, జనవరి 6 : పండుగలా ఉన్న వ్యవసాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దండుగ చేస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నెక్కొండ హైస్కూల్ సెంటర్‌లో సోమవారం బీఆర్ఎస్ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని మాయమాటలు చెప్పి ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామని ప్రకటించి రైతులను కష్టాలపాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.12వేల చొప్పున ఇస్తామన్న హామీకి కట్టుబడి అమలుచేయలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వరంగల్‌కు వస్తున్న ఉప ముఖ్యమంత్రిని అడుగాలని ప్రెస్‌మీట్ పెడితే వెంటనే వందల మంది పోలీసులు బీఆర్ఎస్ కార్యాలయాన్ని ముట్టడించి తమను నిర్బంధించారని, ఇదేం ప్రజాపాలన అని పెద్ది ప్రశ్నించారు. హామీ ప్రకారం రైతుభరోసా ఇవ్వాలని లేకపోతే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌కే పరిమితం కావాల్సి వస్తుందన్నారు. నేటి నుంచి నిరసనలు ప్రారంభమవుతున్నాయని, నర్సంపేట నుంచే రైతుల తిరుగుబాటు ఉవ్వెత్తున లేవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ లావుడ్య సరోజ–హరికిషన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొనిజేటి భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ దేవన బోయిన వీరభద్రయ్య, నాయకులు తోట సాంబయ్య, కారింగుల సురేశ్, ఈదునూరి యాకయ్య, మాజీ సర్పంచ్ మహబూబ్ పాషా, మాజీ వైస్ చైర్మన్ దొనికెన సారంగపాణి, గాదె భద్రయ్య పాల్గొన్నారు.



హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో డిక్లరేషన్ ప్రతులను పాతి పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు



కాజీపేట : సీఎం దిష్టిబొమ్మ దహనం చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు



దుగ్గొండి : గిర్నిబావి వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పాలకుర్తి : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నెక్కొండలో బీఆర్ఎస్ రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## నిర్బంధాల నడుమ నిరసన

హనుమకొండలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ అక్రమ అరెస్ట్



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద దాస్యం వినయ్‌భాస్కర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సోమవారం మంత్రుల పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన క్రమంలో హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. సోమవారం ముఖ్య కార్యకర్తలతో పార్టీ ఆఫీసులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సమావేశం నిర్వహించి ఆ తర్వాత రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో 'రైతు డిక్లరేషన్' ప్రకటించిన స్థలంలో నిరసన తెలిపేందుకు ముఖ్య నేతలు, కార్యకర్తలతో వెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. కనీసం నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద నిరసనకు అనుమతించాలని విజ్ఞప్తి చేసినా వినకుండా కార్యాలయంతో పాటు అడుగడుగునా నిర్బంధించారు. ఈ క్రమంలో నిర్బంధాలను దాటుకుంటూ వినయ్‌భాస్కర్ పోలీసులను ప్రతిఘటిస్తుండగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు మధ్య తోపులాటతో పాటు వాగ్వాదం జరిగింది. వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు నాయకులను బలవంతంగా పోలీస్ వాహనాల్లోకి కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంత్రుల పర్యటన ముగించుకొని వెళ్లేదాకా ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు స్టేషన్‌లోనే నిర్బంధించారు.

## కాంగ్రెస్‌ను రైతన్నలే పాతరేస్తరు

- కేసీఆర్ రైతుబంధు.. రేవంత్ రాబందులా మారారు
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

కరీమాబాద్, జనవరి 6 : రైతులను మోసం చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతన్నలే పాతరేస్తారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. సోమవారం ఖిలా వరంగల్ పెట్రోల్‌బంకు జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఎన్నికలప్పుడు ఎకరానికి రూ.15వేలు ఇస్తానని చెప్పి ఇప్పుడు 12వేలకు కుదించి రైతుల పొట్టకొడుతున్నదని మండిపడ్డారు. ఇప్పటికే ఏడాది కాలంగా రైతుబంధు రాలేదని గ్రామాల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ పూటకో మాట మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ మోసం చేస్తుందన్నారు. రైతుబంధు, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మభ్యపెట్టాలని చూస్తున్నదన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 'రైతుబంధు'గా నిలిస్తే.. నేడు రేవంత్‌రెడ్డి రైతు రాబందుగా మారారని ఎద్దేవా చేశారు. హామీలపై ప్రజలు నిలదీస్తారనే కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేస్తున్నారన్నారు. తులం బంగారం.. పింఛన్లు, మహిళలకు 2500 రూపాయలపై ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇక జిల్లా మంత్రి నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయకపోతే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల ఆధ్వర్యంలో పోరాటం తప్పదన్నారు. రైతులు, ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉన్నదని ప్రజల పక్షాన ప్రజల సహకారంతో ప్రభుత్వాని నిలదీస్తామని నరేందర్ చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.



కేసముద్రం : రహదారిపై నాయకులు, కార్యకర్తలతో కలిసి బైఠాయించిన శంకర్‌నాయక్

## రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, జనవరి 6 : రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15వేలు ఇవ్వకుండా మోసం చేస్తూ రైతు వ్యతిరేక పార్టీగా కాంగ్రెస్ నిలిచిపోయిందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం కేసముద్రం మార్కెట్ ఎదుట నిర్వహించిన ధర్నా ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, రుణాలు మాఫీ కాక పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందించిన సీఎం కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిస్తే.. ఆ రైతుబంధును నిలిపివేసిన రేవంత్ రైతుల పాలిట శాపంగా మారాడని విమర్శించారు. రేవంత్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్లే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి రూ.ఒక్క లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ఒక్క ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడం లేదని ఆరోపించారు. హామీలను అమలుచేసేదాకా ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఓలం చంద్రమోహన్, మండల అధ్యక్ష కార్యదర్శులు మహ్మద్ నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ దీకొండ వెంకన్న, మాజీ మండల అధ్యక్షుడు జాటోత్ హరీశ్‌నాయక్, మోడెం రవీందర్‌గౌడ్, గుడుగు కొమ్మన్న, నాయకులు ఊకంటి యాకుబ్‌రెడ్డి, సట్ల వెంకన్న, దార్ల రాంమూర్తి, గుగులోత్ వీరునాయక్, ఘనపారపు రమేష్, సంజీవ, అన్నెపాక వెంకన్న, కొమ్ము రాహుల్, గడ్డం యాకమూర్తి, లింగాల పిచ్చయ్య, బానోత్ వెంకన్న ఉన్నారు.



ములుగులోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న బడే నాగజ్యోతి

## హామీలను వెంటనే అమలు చేయాలి

- డీబీఎం-38 కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ, జనవరి 6 : వరంగల్ వేదికగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన రైతు డిక్లరేషన్ ప్రకారం హామీలన్నీ వెంటనే అమలు చేయడంతో పాటు డీబీఎం–38 ద్వారా సాగునీరు విడుదల చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం గోరికొత్తపల్లి, రేగొండ మండలకేంద్రాల్లో గంట పాటు రాస్తారోకో చేయడంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు మోసం చేస్తున్నదని మండిపడ్డారు. రుణమాఫీ చేస్తామని చెప్పి కొంతమందికే మాఫీ చేసిందని.. అలాగే రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఇప్పుడు 12వేలే అంటూ మరోసారి దగా చేసిందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను వంచించి ఏ ఒక్కటీ అమలుచేయడం లేదన్నారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వడం లేదన్నారు. ఒక ఉద్యోగం కూడా ఇవ్వకుండా.. కేవలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగాలకు నియామాక పత్రాలు అందజేసి తామే ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రకటనలు చేస్తున్నదన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రం మరింత వెనుకబడి పోయిందన్నారు. ఇప్పటికైనా హామీలన్నింటినీ అమలు చేయాలని లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటలు తప్పవని గండ్ర హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, హమీద్, నాయకులు ఇంగె మహేందర్, విద్యాసాగర్‌రెడ్డి, కొల్గూరి రాజేశ్వరావు, కొలిపాక భిక్షపతి, సామల పాపిరెడ్డి, లింగారెడ్డి, చంద్రాకర్‌రెడ్డి, నీలాంబరం ఉన్నారు.




దేవరుప్పుల : ప్లకార్డుతో రైతు దూడల కొంరయ్య



రేగొండ : జాతీయ రహదారిపై శ్రేణులతో కలిసి రాస్తారోకో చేస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి